క్లుప్తంగా

కాంగ్రెస్ హయాంలో గ్రామాల అభివృద్ధి

భూత్పూర్: కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చొరవతో మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని బీటీ రోడ్డు నుంచి కర్వెన గ్రామానికి రూ.4 కోట్ల 20 లక్షలతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హర్యానాయక్, ఆనంద్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

రెండో రోజు కొనసాగిన రిలే నిరాహారదీక్ష

జడ్చర్ల టౌన్: బెల్టుషాపుల్లో మద్యం ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారం రెండోరోజు కొనసాగింది. మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా నిర్వహించిన దీక్షలో సంఘం జిల్లా అధ్యక్షుడు భీమయ్య, ప్రధాన కార్యదర్శి అల్వాల్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం దుకాణదారులు బెల్టుషాపులకు ఎక్కువ ధరలకు మద్యం విక్రయించటం వల్లే గ్రామాల్లో అధిక ధరలకు రైతులు, పేదలు కొనాల్సి వస్తుందని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులందరిని కలవటం జరిగిందని, ఎవరు చర్యలు తీసుకోవటం లేదని త్వరలోనే కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడించారు.

వసతి గృహంలో వైద్య శిబిరం

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల బాలుర వసతి గృహంలో గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ బృందం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి కావల్సిన వారికి మందులు అందించారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, ప్రధానంగా చేతులను భోజనానికి ముందు, తరువాత శుభ్రంగా కడుకోవాలని సూచించారు. శిబిరంలో హాస్టల్ వార్డెన్ ప్రవీన్‌కుమార్, తదితరులు ఉన్నారు.

గండేడ్ ఎంపీడీఓగా మంజుల



గండేడ్: గండేడ్ ఎంపీడీఓగా మంజుల నియమితులయ్యారు. గతంలో ఎంపీడీఓగా ఉన్న దేవన్న పదవీ విరమణ చేయడంతో కోయిల్‌కొండ మండలంలో పని చేసే సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డిని ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు. ఇన్నాళ్లపాటు అతనే బాధ్యతలు నిర్వహించారు. కలెక్టర్ గండేడ్ మండలానికి నూతన ఎంపీడీఓను నియమించారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలో పనిచేస్తున్న మంజులను గండేడ్‌కు నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలి

నవాబుపేట: ఉపాధి కూలీలకు త్వరగా ఈకేవైసీ పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఉపాధి సిబ్బందికి కూలీల ఈకేవైసీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నెట్‌వర్క్ నేపథ్యంలో సరైన స్థలం ఎంచుకుని కూలీలకు చెందిన ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన వివరించారు. ప్రతి జాబ్‌కార్డు కలిగిన కూలీని వెంటనే ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియను ఉపాధి ఫీల్డు అసిస్టెంట్లు త్వరగా పూర్తిచేసి సమాచారం అందించాలన్నారు. రోజువారిగా టార్గెట్ ఎంచుకుని ఈ ప్రక్రియను పూర్తి చేయాలని వివరించారు. సందర్భంగా జరిగిన సమావేశంలో ఏపీఓ జ్యోతి, ఉపాధి సిబ్బంది తదితర అధికారులు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఏనుగొండకు చెందిన ఆంజనేయులు, లక్ష్మి దంపతుల కుమార్తె అఖిల ఎప్‌ఏసెట్‌లో ర్యాంకు సాధించి ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. ఆర్థిక ఇబ్బందులు వల్ల నరసింహాచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.20వేలు ట్రస్టు సభ్యులు విద్యార్థిని తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గిరిధర్, నరేందర్, శ్రీనివాసులు, దోమ వెంకటేష్, వినయ్, నరేష్, లక్ష్మణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు..

నవాబుపేట: మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఆర్థిక సహాయం అందించారు. గురువారం గ్రామానికి చెందిన దాసరి సాయమ్మ(65) అనారోగ్యంతో మృతి చెందారు. సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బరోసానిచ్చారు. ఆయన వెంట ఆంజనేయులు, నిరంజన్, రమేష్, యాదయ్య,కృష్ణయ్య, నర్సింహులు ఉన్నారు.

వైభవంగా బోగ్ బండార్

కల్వకుర్తి రూరల్: మండలంలోని రామ్ దండియా దేవాలయ ప్రాంగణంలో గురువారం హాథీరాం మహారాజ్ మఠం ఆధ్వర్యంలో బోగ్ బండార్ నిర్వహించారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనులు చేపట్టనున్న చలో తిరుపతి కార్యక్రమం విజయంతం కావాలని ఆకాంక్షించారు.

పాఠశాలలో డీఈఓ తనిఖీ

- విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- అక్షయ పాత్ర నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాధికారి ప్రవీణ్‌కుమార్

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం లాల్‌కోట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కప్ప వచ్చిందన్న వదంతులపై గురువారం జిల్లా విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్షయ పాత్ర నిర్వాహకులకు, పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్న భోజనంలో కప్ప వచ్చిందన్న వదంతులు వాస్తవమని పేర్కొన్నారు. భోజన సమయంలో విద్యార్థులకు కప్ప కనిపించడంతో భోజనాని పారబోశారని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి భాగానే ఉందని వివరించారు. ప్రస్తుతం కప్ప అక్షయ పాత్ర ద్వారా వచ్చిందా లేక పాఠశాల పరిసరాల నుంచి వచ్చిందా, భోజనం వడ్డించే సమయంలో భోజనంలో పడిందా అనే కోణంలో పరిశీలించామన్నారు. అట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఈ ఘటనకు కారకులైన అక్షయపాత్ర నిర్వహకులకు, పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లయ్య, ఎంఈఓ మురళీకృష్ణ, పలువురు ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ ఆశా కార్యకర్తల సంఘం జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని సుమారు 40 కోట్ల మంది కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తూ సందపను సృష్టిస్తున్నా వారి సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మిక చట్టం ప్రకారం ఐదేళ్లకోసారి వేతనాలు పెంచాల్సి ఉందని, 15 ఏళ్ల గడిచినా దాని ఊసే ఎత్తకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈనెల 26, 27న తెలంగాణ ఆశా కార్యకర్తల సంఘం ఐదో రాష్ట్ర మహాసభలు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామన్నారు. మొదటి రోజు నగరంలో పెద్ద ఎత్తున ప్రదర్శన ఉంటుందని, రెండోరోజు మహాసభ జరుగుతుందన్నారు. వాటికి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తి, కోశాధికారి బొల్లె చంద్రకాంత్, నాయకులు కిల్లె గోపాల్, రాజ్‌కుమార్, పద్మ పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ: కేసు నమోదు

జడ్చర్ల: స్థానిక రంగారావుతోటలోని సన్‌షైన్ స్కూల్‌లో దొంగతనంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఈనెల 13న రాత్రి పాఠశాల తాళాలు విరగ్గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించి అక్కడున్న టీవీ, కంప్యూటర్, ల్యాప్‌టాప్, టాబ్స్, రికార్డులు అపహరించారని కరస్పాండెంట్ హఫీజ్ బిన్ హసన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

అథ్లెటిక్స్ కోచ్, మేనేజర్లకు సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: ఒడిశా రాష్ట్రంలో భువనేశ్వర్‌లో ఈనెల 10 నుంచి 14 వరకు జరిగిన జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా శరత్‌చంద్ర, కోచ్‌గా సునీల్‌కుమార్ వ్యవహరించారు. వారిని గురువారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాంప్లెక్స్‌లో హనుమాన్ యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పుట్టి సురేష్‌చందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ.వెంకటేశ్ మాట్లాడుతూ అథ్లెటిక్స్ జట్టుకు జిల్లా నుంచి మొదటిసారిగా కోచ్, మేనేజర్‌గా అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు 6 బంగారు పతకాలు, 2 రజతం, 2 కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రమేష్‌చందర్, సురేష్, జగదీష్, బాలుచందర్, గడ్డం గోపాల్, సృజన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు కళాశాల క్యాంపస్‌లో ఎకో బజార్

కందనూలు: జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల క్యాంపస్‌లో ఎకో బజార్ కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఆధ్వర్యంలో, నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర శాఖ, కళాశాల ఎకో క్లబ్ సమన్వయంతో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ స్నేహపూర్వక ఉత్పత్తుల ప్రదర్శన ప్రధాన లక్ష్యమన్నారు. అంతకుముందు ఎకో బజార్ బ్యానర్‌ను విడుదల చేశారు.



రోజువారి కూలి రూ.920 ఇవ్వాలి



వినతి పత్రం అందిస్తున్న వ్యవసాయ వృత్తిదారుల సంఘం కోఆర్డినేటర్ జ్యోతి



డిమాండ్ల పత్రంతో యూనియన్ నాయకులు

నవాబుపేట: వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.920 వేతనం ఇచ్చేలా సమగ్ర చట్టం తీసుకు రావాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు సంఘం ద్వారా డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఇటీవల అక్టోబర్ 1 నుంచి 16 వరకు ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించిందని, దీన్ని ఆకలి దినాలుగా సంఘం పరిగనిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎంకే శ్రీనివాస్, చెన్నయ్య, అంజమ్మ, లక్ష్మమ్మ,, నర్సింహులు, రామస్వామి ఉన్నారు.

గండేడ్: అక్టోబర్ 16ను ప్రపంచ ఆహార దినోత్సవంగా జరుపుకుంటే మాకిది ఆకలిరోజు అని వ్యవసాయ వృత్తిదారుల సంఘం యూనియన్ గండేడ్ మండల కోర్డినేటర్ జ్యోతి పేర్కొన్నారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ధరలతో తాము ఏమీ కొనలేని, తినలేని పరిస్థితుల్లో ఉన్నామని ఆమె పేర్కొన్నారు. సిలిండర్, ఉప్పు, పప్పు, నూనె, వంటివి అన్ని పెరిగి తమకు అందనంత దూరంలో ఉన్నాయన్నారు. నైపుణ్యం లేని కూలీలుగా తమను గుర్తించారని అలాంటప్పుడు తమకు ఉపాధి ఎలా దొరుకుతుందని ఆమె ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తమ బాధలు కష్టాలు గుర్తించి తమకు అన్ని రకాలుగా న్యాయం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చెందిన రికార్డు అసిస్టెంట్ రుక్మిణికి వినతిపత్రం అందించారు.

గాలికుంటు టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

భూత్పూర్: పశువులకు సోకే ప్రమాదకరమైన వ్యాధి గాలికుంటు వ్యాధిని, పశువుల యజమానులు తమ పశువులకు టీకాలు ఇప్పించాలని మండల పశువైద్యాధికారి డా.మధుసూదన్ అన్నారు. గురువారం మండలంలోని అన్నాసాగర్, కొత్త మొల్గరతో పాటు మున్సిపాలిటీలో 399 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని పశువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు వహించాలని ఆయన కోరారు.



కొత్త మొల్గరలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డా.మధుసూదన్

ఉత్సాహంగా చదరంగం పోటీలు



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన చెస్ పోటీలు విజయవంతం అయ్యాయి. 69వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా జిల్లా స్థాయి అండర్ -14, అండర్ -17 బాలబాలికల చదరంగ పోటీలు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటాపోటీగా ఎత్తులకు పైఎత్తులు వేస్తూ పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అండర్ -14 బాలికల విభాగం నుంచి ఐదుగురు, బాలుర విభాగం నుంచి ఐదుగురు, అండర్- 17 లో బాలికలు, బాలుర నుంచి ఐదుగురు చొప్పున ఎంపికయ్యారు. వీరు ఈనెల 18న వనపర్తిలో జరిగే ఉమ్మడి మహబూబ్ నగర్ స్థాయి పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ మాజీ సెక్రెటరీ నర్సిములు, పిడిలు రత్నయ్య, కథలప్ప, బాలరాజ్, వెంకటేష్, రామకృష్ణరెడ్డి, అక్తర్, పర్వీన్, అనంత సేన, కృష్ణవేణి పిఈటిలు బసంత్ రెడ్డి, రాజేష్, చక్రి, మోహన్ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలకు పెరుగుతున్న ఆదరణ



అమరచింత: చేనేత వస్త్రాలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని నాబార్డ్ సీజీఎం ఉదయ భాస్కర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని అమృత్ మహల్‌లో అమరచింత చేనేత వస్త్ర తయారీ సంఘం ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘం ఏర్పాటై అంచలంచెలుగా ఎదుగుతూ ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా దేశ విదేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోందని తెలిపారు. రాష్ట్ర రాజధానిలో సైతం తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ప్రత్యేక షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికులు కంపెనీలో భాగస్వాములుగా ఉంటూ వచ్చిన లాభాలను సమానంగా పంచుకొని వ్యాపారాలు, ఉత్పత్తులను పెంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టెస్కో ఎండీ వైకే రావు, ఫౌండేషన్ ఫర్ ఎంఎస్ఎంఈ అడ్వైజర్ శ్రవణ్‌కుమార్‌శర్మ, అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘం కంపెనీ సీఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం



మక్తల్: మండలంలో వల్లభపురంలోని విఠల్ బాబా ఆశ్రమంలో గణపతి అధర్వ శీర్ష సహస్ర అభిషేకాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదట కృష్ణాపుష్కరం నీటిలో జలాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమం కార్యదర్శి రామలింగారెడ్డి, అభిషేక సమన్వయకర్త వినోద్ కుమార్, మహిళలు తదితర భక్తులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకపోతే వాహనం సీజ్

కృష్ణా: వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ నవీద్ సూచించారు. మండలంలోని జాతీయ రహదారిపై గురువారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. దాదాపు 25 ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోయినా, సరిగ్గా కనిపించక పోయినా వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు.

తెలంగాణ బంద్ విజయవంతం చేద్దాం



ఐక్యత ప్రదర్శిస్తున్న అఖిలపక్ష నాయకులు

జడ్చర్ల టౌన్: బీసీ ఐక్యతను చాటుతూ శనివారం నిర్వహించనున్న తెలంగాణ బంద్‌ను విజయవంతం చేద్దామని రౌండ్‌టేబుల్ సమావేశంలో బీసీ అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో బీసీజాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా బంద్‌కు సహకరించాలని కోరారు. బంద్‌రోజున పోలేపల్లి ఫార్మ సెజ్‌తో పాటు విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు మూసివేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ లక్ష్యంగా పనిచేద్దామని ప్రకటించారు. బంద్‌కు ఎమ్మార్పీఎస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, ధర్మసమాజ్‌లు మద్దతు ప్రకటించాయి. రౌండ్‌టేబుల్ సమావేశంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, రేణుకమ్మ, జంగయ్యమాదిగ, ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, ఫకీర్‌జహంగీర్, నడిమింటి శ్రీనివాసులు, ప్రణీల్‌చందర్, దగ్గుల బాల్‌రాజ్‌మాదిగ, రమేష్‌జి, పిట్టల మురళి పాల్గొన్నారు.

42శాతం సాధించే వరకు విశ్రమించేది లేదు

మెట్టుగడ్డ: 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని, పోరాటం ఉధృతం చేస్తామని బీసీ జేఏసీ చైర్మన్ బెక్కెం జనార్దన్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో రెడ్‌క్రాస్ హాల్లో కుల సంఘాల, ప్రజా సంఘాలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బంద్‌లో ప్రతిబీసీ బిడ్డ తెలంగాణ ఉద్యమ తరహాలో ముందుకు కదలాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, యాజమాన్యాలు బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు మున్నూరు రాజు, కోరమోని వెంకటయ్య, శ్రీనివాస్ సాగర్, ఎస్ ప్రభాకర్, మెట్టుకాడి ప్రభాకర్, పాండురంగం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కృష్ణుడు, జుర్రు నారాయణ, రమేష్‌గౌడ్, రజనీకాంత్, కొండా బాలయ్య, రాములు, సాయిలు పాల్గొన్నారు.

18న సకలం బంద్

18న సకలం బంద్, సబ్బండ వర్గాల శంఖారావం విజయవంతం చేద్దామని కార్మిక ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో కార్మిక, ప్రజాసంఘాల, సబ్బండ వర్గాల ఆధ్వర్యంలో విస్తృత రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్, అనీఫ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు సాధన ఉద్యమంలో కార్మిక, ప్రజా సంఘాలు, ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీ సంఘాలు, వామపక్ష పార్టీలు, సబ్బండ వర్గాలు ఈ బీసి రిజర్వేషన్ ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. తెలంగాణలో ఉన్న బీసీలంతా ఒక్కగంట రోడ్డెక్కితే రాజకీయ భూకంపం సంభవిస్తుందన్నారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



గంగాపురంలో సీపీఆర్ శిక్షణ ఇస్తున్న డాక్టర్

జడ్చర్ల: ప్రతి ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని జడ్చర్ల 108 ఈఎంటీ శివకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలను నిలిపే అవకాశం ఉంటుందన్నారు. సీపీఆర్ చేసే క్రమంలో పాటించే నియమ, నిబంధనలు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో పైలెట్ మల్లేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో బాగంగా మండలంలోని గంగాపురం ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. డా.శివకాంత్ సీపీఆర్‌పై శిక్షణ ఇస్తూ గుండెపోటుతో పడిపోయిన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ చేయటం వల్ల 10మందిలో ఇద్దరిని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యుడు డా.ప్రతాప్‌చౌహన్, సిబ్బంది పాల్గొన్నారు. అర్బన్ హెల్త్‌సెంటర్ డా.మనుప్రియ ఆధ్వర్యంలో పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. సుకన్య, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా.మాధురి, హెల్త్‌క్లబ్ కో ఆర్డినేటర్‌భాగ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను నిలిపేయాలి



మైనింగ్ లోడుతో వెళ్తున్న లారీని జీపీఓ నర్సింహులుకు అప్పగిస్తున్న బీజేపీ నాయకులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వెనుక ఉన్న గుట్టల్లో చేపట్టిన అక్రమ మైనింగ్‌ను నిలిపి వేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల అక్రమంగా మైనింగ్ చేపట్టి రాళ్లను తొలగించి విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ గురువారం బీజేపీ నాయకులు బోయ రమేష్, గట్టు మల్లేష్‌గౌడ్, రఘువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ధర్మారెడ్డి, జంగం సుందరయ్యలు మైనింగ్ లోడుతో వెళ్తున్న లారీని గ్రామంలోని దేవాలయం ముఖద్వారం వద్ద అడ్డుకున్నారు. తర్వాత తహసీల్దార్ శేఖర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఆదేశాలతో స్థానిక జీపీఓ నర్సింహులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. దానికి ఎలాంటి అనుమతి లేకపోవడంతో లారీని అడ్డాకుల తహసీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. దేవాలయం అభివృద్ధి పేరుతో కొందరు నాయకులు అక్రమంగా బ్లాస్టింగ్ చేయిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. పురాతన ఆనవాళ్లు ఉన్న బండరాళ్లను పగులగొట్టిస్తున్నారన్నారు. దేవాలయం వెనుకే ఇంత తతంగం జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోనందున జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేయాలి

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్



సమావేశంలోమాట్లాడుతున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొండయ్యకు రావాల్సిన రిటైర్మెంట్ బకాయిల్లో రూ.9 లక్షలు వెంటనే తన అకౌంట్‌లో జమ చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా జిల్లాలో పలు శాఖలలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన అనేకమంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ రిటైర్మెంట్ లాభాలు, గ్రాట్యుటీ, పింఛన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్, జీఐఎస్ తదితర బెన్‌ఫిట్లను సమయానికి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇనాయత్, శాంసన్, భాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, రాఘవేందర్ రావు, విజయ్ పాల్గొన్నారు.